ఈనాడు చిత్తూరు

ఆదివారం 21 ఆగస్టు 2016 20 పేజీలు

## ఆర్థిక స్వావలంబనలో ఆధునిక సాంకేతిక పాత్ర కీలకం

### నీతిఅయోగ్ సభ్యుడు వి.కె.సారస్వత్




నీతి అయోగ్ సభ్యుడు సారస్వత్‌కు అవార్డు అందిస్తున్న శాసనమండలి ఛైర్మన్ చక్రపాణి

**తిరుపతి(ఎస్‌జీఐకాలనీ), న్యూస్‌టుడే:** భారతదేశంలో ఆర్థిక స్వావలంబన సాధించడంలో ఆదునిక సాంకేతిక పరిజ్ఞానం కీలకమైన భూమిక పోషిస్తోందని నీతిఅయోగ్ సభ్యుడు డాక్టర్ వి.కె.సారస్వత్ అన్నారు. శనివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమి(అగ్రశ్రీ) సంస్థ ఆధ్వర్యంలో 14వ రాజీవ్‌గాంధీ స్మారకోపన్యాసం, జాతీయ పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమాన్ని సారస్వత్, రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ చక్రపాణి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సారస్వత్ మాట్లాడుతూ.. భారతదేశంలో ప్రజలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మెరుగైన మౌలిక సదుపాయాలతోపాటు.. ప్రభుత్వాలు వినూత్న పదకాలను రూపొందించి అమలు చేయాలని సూచించారు. భారత రక్షణ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ విశేష కృషిచేశారని చెప్పారు. భారత్‌లో ప్రాణాళికాబద్ధమైన ఆర్థికాబివృద్ధికి నీతిఅయోగ్ 2019 నాటికి 24గంటల విద్యుత్, 2022 నాటికి ప్రతి పౌరునికి ఇల్లు, 100 స్మార్ట్ సిటీలు, జన్‌ధన్‌యోజనా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్టప్‌ఇండియా-స్టాండప్ ఇండియా వంటి పథకాలను రూపొందించినట్లు వెల్లడించారు. అంతకుముందు శాసనమండలి ఛైర్మన్ చక్రపాణి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వివిధ పథకాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు వీటిని అందిపుచ్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజీవ్‌గాంధీ అత్యున్నత నాయకత్వ జాతీయ పురస్కారం డాక్టర్ వి.కె.సారస్వత్‌కు రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ ప్రదానం చేశారు. అదేవిధంగా భారత కో ఆపరేటివ్ నెట్‌వర్క్‌ఫర్ ఉమెన్ అధ్యక్షురాలు డాక్టర్ నందిని అజాద్, కొల్లాం పంచాయితీ అధ్యక్షురాలు కె.జగదమ్మ, నేచర్ గ్రీన్‌టెక్స్ సాయి ఫౌండేషన్ అధ్యక్షులు వెంకటరావ్ వై.గోర్పేడు, తవణంపల్లె ఎంపీపీ బి.సరళకుమారి, తమిళనాడు ముడిచూకు గ్రామ సర్పంచ్ పి.దామోదరానికి అవార్డులు అందజేశారు. అనంతరం ప్రత్యేక సంచికలను రాజ్యసభ మాజీ సభ్యుడు సోలిపేట రామచంద్రారెడ్డి ప్రారంభించి డి.భారతీ సుందర్‌రామ్‌కు అందించారు. భారత ఆర్థిక స్వావలంబనలో స్వయం సహాయక సంఘాల పాత్రపై రెండు రోజుల సదస్సును శాసనమండలి ఛైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సభాపతి అగరాల ఈశ్వర్‌రెడ్డి, చెన్నై, ఉమెన్స్‌ఫోరం అధ్యక్షురాలు పద్మశ్రీ జయ అరుణాచలం, ఆచార్య డి.నారాయణరావు, అగ్రశ్రీ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డి.సుందర్‌రామ్ దంపతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.